# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-09-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

2. **తెలంగాణలో బతుకమ్మ పండగను ఈ రోజు నుంచి 9 రోజుల పాటు నిర్వహించనున్నారు.**

3. **కోనసీమ ప్రాంతంలో సముద్రపు నీరు వల్ల దెబ్బతిన్న కొబ్బరి తోటలను త్వరలో పరిశీలించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.**

4. **రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రసార భారతి బోర్డు ఛైర్మన్ నవనీత్ కుమార్ సెహగల్ తిరుపతి చేరుకున్నారు.**

============================

రాష్ట్రాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. పల్నాడు జిల్లా మాచర్లలో స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్రక్యమంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీల్లో నిల్వ ఉన్న వ్యర్థాలను వచ్చే నెల 2వ తేదీ నాటికి తొలగిస్తామన్నారు. 2047 నాటికి రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం ఉండేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

మరోవైపు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిన్న నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు స్వర్ణాంధ్ర ర్యాలీలు, ప్రతిజ్ఞలు చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని కోరారు.

------------------------

తెలంగాణలో బతుకమ్మ పండగను ఈరోజు నుంచి 9 రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆడబిడ్డలందరికీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక అని, ప్రకృతిని ఆరాధిస్తూ చేసుకునే గొప్ప పండగని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కష్టసుఖాలను కలిసి పంచుకునే ప్రజల ఐక్యతకు ఈ పండుగ నిదర్శనమని పేర్కొన్నారు.

మరోవైపు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. గౌరీమాత అందరికీ ఆయుష్షు, ఆరోగ్యం ఇవ్వాలని ఆకాంక్షించారు.

------------------------

ప్రజాసేవ, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కృషి చేస్తోంది. "సేవా పర్వ్" పేరుతో ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. దేశవ్యాప్తంగా మహిళా సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

...వాయిస్ ... 1.40 సెకన్లు

---

కోనసీమ ప్రాంతంలో సముద్రపు నీరు వల్ల దెబ్బతిన్న కొబ్బరి తోటలను త్వరలో పరిశీలించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ ప్రాంతంలోని శంకరగుప్తం మేజర్ డ్రయిన్ వెంట ఉన్న కొబ్బరి తోటల్లోకి సముద్రపు నీరు చేరడంతో కొబ్బరి చెట్లు తలలు వాల్చేసి వేల ఎకరాల్లో తోటలు దెబ్బ తిన్న విషయం తన దృష్టికి వచ్చిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సముద్రపు పోటు సమయంలో ఉప్పు నీరు వైనతేయ పాయ నుంచి శంకరగుప్తం డ్రయిన్‌లోకి చేరుతుందన్నారు. రైతాంగంతోను, నీటిపారుదల, వ్యవసాయ అధికారులు, కొబ్బరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలతో చర్చించి పరిష్కార మార్గాలు అన్వేషించనున్నట్లు వెల్లడించారు.

---

రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రసార భారతి బోర్డు ఛైర్మన్ నవనీత్ కుమార్ సెహగల్ నిన్న తిరుపతి చేరుకున్నారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో ఆలిండియా రేడియో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎం.సోమేశ్వరరావు, దూరదర్శన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఇ.రవికుమార్, తిరుపతి ఆలిండియా రేడియో అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.సుధాకర్ మోహన్‌లు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డుమార్గంలో తిరుమలకు బయలుదేరి వెళ్ళారు. ఈరోజు ఆయన విఐపి విరామ దర్శన సమయంలో వెంకటేశ్వర స్వామివారిని కుటుంబ సమేతంగా దర్శించుకోనున్నారు. అనంతరం తిరుపతిలోని ఆలిండియా రేడియో స్టేషన్‌తో పాటు దూరదర్శన్ కేంద్రాన్ని పరిశీలిస్తారు.

---

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 126వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 26వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---

ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బాల్యానికి సంబంధించిన ఇతివృత్తంతో నిర్మించిన "చలో జీతే హై" లఘు చిత్రాన్ని పలు థియేటర్లలో ప్రదర్శిస్తున్నారు. ఈనెల 17న ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా ప్రారంభమై ఈ నెల 24 వరకు ప్రదర్శించనున్న ఈ లఘు చిత్రానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. ఈ చిత్రాన్ని వీక్షించిన విశాఖపట్నానికి చెందిన ప్రేక్షకుడు ఆకాశవాణితో మాట్లాడుతూ..

..వాయిస్..25 సెకన్లు

---

పశ్చిమగోదావరి జిల్లాలో 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార అభియాన్' కార్యక్రమంలో భాగంగా 4 రోజులలో 175 వైద్య శిబిరాలను నిర్వహించినట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గీతా బాయి చెప్పారు. భీమవరంలో ఆమె నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఈ వైద్య శిబిరాల్లో సుమారు 21 వేల 979 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ప్రధానంగా క్యాన్సర్ తో పాటు షుగర్, గుండె జబ్బులు, మహిళలకు, కిషోర్ బాలికలకు రక్తహీనత వంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఆయుష్మాన్ భారత్ కు సంబంధించిన కార్డులను కూడా లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

---------------------------

వస్తు సేవల పన్ను – జిఎస్టీ భావితరం సంస్కరణల్లో భాగంగా కొన్ని వస్తువలపై జిఎస్టీ ని సరళతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలు హర్షం వక్తం చేస్తున్నారు. పల్నాడు జిల్లాకు చెందిన మందుల దుకాణ యజమాని శంకరరావు ఈ అంశంపై ఆకాశవాణితో మాట్లాడుతూ..

..వాయిస్.. 23 సెకన్లు

---------------------------

మధ్య బంగాళాఖాతం, దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ, ఉత్తర అంతర కర్ణాటక మీదుగా దక్షిణ మహారాష్ట్ర తీరం వరకు సముద్ర మట్టానికి ద్రోణి విస్తరించి ఉందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎమ్. వెంకట్రావు తెలియజేశారు.

మరోవైపు తెలంగాణలో ఈరోజు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================